క్లుప్తంగా

కార్పొరేట్ల కోసమే కార్మిక చట్టాల్లో మార్పు

నెహ్రూసెంటర్: కార్పొరేట్ శక్తుల లాభాల కోసమే కార్మిక చట్టాలను మార్పు చేశారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జూలై 9వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కుమ్మరికుంట్ల నాగన్న, దార స్నేహబిందు, వాసం దుర్గారావు, బత్తుల వెంకన్న, జనార్దన్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

పెద్దవంగర: రెవెన్యూ సదస్సుల్లో చిన్న, సన్నకారు రైతుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారిని ఆయన మర్యాద పూర్వకంగా కలసి మండల రైతుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.

సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి

కేసముద్రం: రసాయన ఎరువులు, మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి, శాస్త్రవేత్త రాంబాబు అన్నారు. మంగళవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ మహేందర్, ఏఎంసీ డైరెక్టర్ కొట్టం రాము, ఏఈఓలు భాస్కర్, ముజాహిద్, రైతులు పాల్గొన్నారు.

‘అక్రమ కేసులు ఎత్తివేయాలి’

నెహ్రూసెంటర్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని చేపట్టిన ఉద్యమంలో అక్రమంగా నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యమం కేసులో భాగంగా మంగళవారం కోర్టులో హాజరయ్యారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, ఫాతిమా, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

తూకంలో విత్తన కంపెనీల మోసం

కొత్తగూడ: మండలకేంద్రంలో విత్తనాల షాపులను మంగళవారం తూనికలు, కొలతల జిల్లా ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒక షాపులో తనిఖీ చేయగా చంద్ర సీడ్స్ కంపెనీకి చెందిన విత్తనాల బస్తాల్లో ఎలాంటి వివరాలు లేకుండా వచ్చాయి. సంబంధిత కంపెనీ వారిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో వాటిని సీజ్ చేశారు. మరో షాపులో బస్తాపై నెట్ వేయిట్ ముద్రించక పోవడంతో కాంటా పెట్టి పరిశీలించగా 500గ్రాములు తక్కువగా వచ్చింది. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు ప్రతీది పరిశీలించి తీసుకోవాలని అధికారి విజయ్‌కుమార్ సూచించారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి



నెహ్రూసెంటర్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను జూలై 7వ తేదీన గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ కోళ్ల శివమాదిగ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శాగంటి రమేష్, పాశం సాంబయ్య, పాలెపాక ఎల్లయ్య, ప్రవీణ్, రవి పాల్గొన్నారు.

వసతి గృహంలో ప్రవేశాలు

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి కల్పన కోరారు. వసతి గృహంలో 20మంది విద్యార్థులు రెన్యువల్ కాగా మరో 80మందికి అవకాశం ఉందన్నారు. ఇంటర్మీడియట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్థులు చేరవచ్చన్నారు. వివరాలకు 99483 22446, 63052 08131 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



డోర్నకల్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు డిప్యూటీ స్పీకర్‌గా నియమితులైన డాక్టర్ రాంచంద్రునాయక్‌ను మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, నాయకులు మాదా శ్రీనివాస్ తాళ్లా హనుమంతరావు, మల్లం అనిల్, గొల్ల సత్తిరెడ్డి, బోడ హరిలాల్, దారావత్ కృష్ణ పాల్గొన్నారు.

నడక, యోగాతో ఆరోగ్యం పదిలం

- జీపీ, షుగర్ వంటి వ్యాధులు దూరం
- ప్రతి రోజూ అలవాటు చేసుకోవాలని చెబుతున్న వైద్యులు



యోగాలో శిక్షణ ఇస్తున్న శిక్షకుడు

గూడూరు: ఏ వయస్సు వారైనా సులభంగా చేయగలిగే వ్యాయామం నడక. దీంతో శరీరం చురుగ్గా ఉంటుంది. అంతే కాకుండా క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం ద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా యోగా అనేది ఆధ్యాత్మిక క్రమశిక్షణ లాంటిదని, మనసు, శరీరం మధ్య సామరస్యాన్ని తీసుకురావడంపై దృష్టి పెడుతుందని యోగా నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతీ ఒక్కరి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని సూచిస్తున్నారు. అనారోగ్య సమస్యలతో వైద్యుల వద్దకు వెళ్తే, వారు మొదటగా వాకింగ్ చేయాలని, లేదా యోగా చేయాలని సూచించడం విశేషం. దీంతో రోజురోజుకు వాకింగ్ (నడక), యోగా చేసే వారి సంఖ్య పెరుగుతుంది.

బహుళ ప్రయోజనాలు..

మానవ జీవితానికి నేటి వాతావరణ కాలుష్యం, కల్తీ వస్తువులు, ఆహార పదార్థాల కారణంగా రోగాల బారిన పడుతున్నారు. అనారోగ్యంతో ఉన్న వారు రోజు నడక, యోగా చేస్తే వారి ఆయుష్షు పెరుగుతుందని డాక్టర్లు అంటున్నారు. అదేకాక గుండె ఆరోగ్యంగా ఉంటుందని, అధిక రక్తపోటు నియంత్రించడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, బరువు తగ్గడంలో సహాయపడుతాయని వైద్యులు చెబుతున్నారు. మార్నింగ్ వాకింగ్ అనేది ఎక్కువగా పట్టణ ప్రాంతాలలోని పార్కులు, మైదానాలలో కనిపించేది. కానీ నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఏదో ఒక రకమైన ఆరోగ్య ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రతీ ఒక్కరు రోజూ ఉదయం, సాయంత్రం ఖాళీ ప్రదేశాలు.. ఉదయం ప్రధాన రహదారిలో నడక కొనసాగిస్తున్నారు. నేడు ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయగా, కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను నెలకొల్పగా, ఆ మందిరాలకు వచ్చిన వారితో శిక్షకులు యోగా చేయిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ యోగా చేయాలి



యోగా అనేది ఆధ్యాత్మిక క్రమశిక్షణ లాంటిది. యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. మనస్సు, శరీరం మధ్య నిలకడ పెంచుతుంది. ఆరోగ్యకరమైన జీవనానికి యోగా ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలి.

– దోసపాటి శ్రీనివాస్‌గౌడ్, యోగా శిక్షకుడు

జిల్లాస్థాయి క్రికెట్ విజేత మానుకోట



విజేతగా నిలిచిన మహబూబాబాద్ క్రికెట్ జట్టు

మహబూబాబాద్ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంట్రా డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో 6జిల్లాల అండర్19 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా మహబూబాబాద్ జిల్లా క్రికెట్ జట్టు హన్మకొండ, వరంగల్ జట్లుపై హ్యాట్రిక్ విజయం సాధించిందని క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి మంగళవారం తెలిపారు. అండర్–19లో జిల్లా క్రికెట్ జట్టు వరంగల్‌తో తలపడగా 206 పరుగులు చేసి, వరంగల్ జట్టును 199 పరుగులకే ఆలౌట్ చేసిందన్నారు. కార్యక్రమంలో కోచ్ మెతుకు కుమార్, సహాయ కోచ్ వినయ్ కుమార్, ఐలి సంతోష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం



మాట్లాడుతున్న జినుగు మరియన్న

బయ్యారం: రైతులకు నెలనెలా స్థిరమైన ఆదాయం ఆయిల్‌పామ్‌తోనే సాధ్యమని జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న అన్నారు. మంగళవారం మండలంలోని సింగారంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ గెలల కోత మహోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 8,126 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగులో ఉందన్నారు. ఇందులో గార్లలో 221 ఎకరాలలో బయ్యారంలో 123 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు అవుతుందన్నారు. రైతులు పంట మార్పిడి చేసి మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మల్బరీ, ముగన, వెదురు, తేనెటీగల పెంపకం చేపట్టి ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పావని, హార్టికల్చర్ అధికారులు శాంతిప్రియదర్శిని, శాంతిప్రియ, రాజకిశోర్, శరత్, అశోక్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై చర్యలు చేపట్టాలి

- జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్



గార్ల: మాట్లాడుతున్న అధికారి హరిప్రసాద్

గార్ల: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. వైద్య సిబ్బంది సైతం గ్రామాల్లో తిరుగుతూ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగించాలని, ఇంటి బయట ప్లాస్టిక్ డబ్బాల్లో, కూలర్లలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మంగమ్మ, పీహెచ్‌సీ డాక్టర్ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ/కురవి/డోర్నకల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గుగులోతు రవికుమార్, సాధ్విజ, మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ సోమ్లానాయక్, కురవి మండల స్పెషల్ అధికారి నర్సింహారావు, విరాజిత, స్రవంతి, డీపీఓ ఎల్లయ్య, ్రతహసీల్దార్ ఇమ్మానియల్, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, ఎంపీఓ మున్వర్‌అలీ, మేనేజర్ విజయకాంత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలో గల సబ్‌స్టేషన్ ఆవరణంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు బుధవారం నిర్వహించనున్నట్లు కేసముద్రం ఏడీఈ సీహెచ్.ప్రశాంత్, విద్యుత్ శాఖ ఏఈ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ నరేష్

పెద్దవంగర: ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్‌ను అమర్చుకొని ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకం సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మకల్లులో రూ.1.10కోట్ల విలువ గల 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఈ నరేష్ మాట్లాడారు. రైతులందరూ తమ వ్యవసాయ బోర్‌మోటార్లకు కెపాసిటర్ అమర్చుకుంటే ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడకుండా ఉండటమే కాకుండా మోటార్ సామర్థ్యం పెంచుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ మధుసూదన్, డీఈ ఎమ్మార్టీ సునీత, ఏడీఈ లోకనాథ్, ఏఈ రమేష్ బాబు, ఏఎల్ఎం వెంకన్న, పవన్ కల్యాణ్, పుల్లయ్య, విద్యుత్ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



గార్ల: ఎమ్మెల్యే కనకయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల: గార్ల పెద్దచెరువులో ఆక్రమణకు గురైన శిఖం భూమిని వెలికితీయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గార్లలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులో అఖిలపక్షం నాయకులు నినాదాలు చేస్తూ గంటపాటు అడ్డుకున్నారు. రెవెన్యూ సదస్సును ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య రాగానే ఆందోళన తీవ్రతరం చేశారు. నాయకులకు ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, తహసీల్దార్ ఆర్ శారద, ఎంపీడీఓ మంగమ్మ, భూక్యా నాగేశ్వరరావు, నాయకులు శ్రీనివాస్, జడ సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని గాజులగట్టులో 100 మంది, గుండెంగలో 150 మంది సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ నాగభవాని తెలిపారు.

నెల్లికుదురు: మండలంలోని మధనతుర్తి, మెచరాజుపల్లి గ్రామాలల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 353 దఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ చందా నరేష్ తెలిపారు.

డోర్నకల్: డోర్నకల్ మండల పరిధిలో రెవెన్యూ సదస్సులు మంగళవారం ముగిశాయి. చివరి రోజు అమ్మపాలెం రైతువేదికలో నిర్వహించిన సదస్సులో 380కు పైగా దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఇమ్మానియల్ తెలిపారు.

కొత్తగూడ: మండలంలోని ఓటాయి గ్రామంలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సును ఆర్డీఓ కృష్ణవేణి పరిశీలించారు. కార్యక్రమంలో అధికారుల పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య



గూడూరు: మచ్చర్ల బేతంచర్లలో బడిబాటలో పాల్గొన్న ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో..



బయ్యారం: బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే కనకయ్య, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు వసతులు అందుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పిల్లల ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. – సాక్షి నెట్‌వర్క్

నేడు, రేపు జాబ్‌మేళాలు

మహబూబాబాద్: జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో ఆ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11,12 తేదీల్లో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో 50ఉద్యోగాల కోసం బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ చదివి ఉండి 18 నుంచి 35సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు. నెలకు రూ.12,000 నుంచి రూ.25,000 వరకు వేతనం ఉంటుందన్నారు. జాబ్‌మేళా ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉంటుందని, ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానుకోటలోని శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగ అవకాశాలకు ఈనెల 12న కార్యాలయంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులని, ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, బయోడెటాతో హాజరుకావాలన్నారు.

జర్నలిస్టు ‘కొమ్మినేని’ అరెస్ట్ సరికాదు



కేసముద్రం: నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, సంఘాల నాయకులు

కేసముద్రం: సాక్షి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు, ఏపీలో సాక్షి కార్యాలయాలపై దాడులు చేయడాన్ని ఖండిస్తూ కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ సెంటర్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ), వివిధ పార్టీల, సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలను ధరించి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూ(ఐజేయూ) రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు బండి సంపత్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాక్షి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని, సాక్షి కార్యాలయాలపై దాడులు చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. వెంటనే కొమ్మినేని శ్రీనివాసరావుపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దూదికట్ల రామాచారి, శాగంటి శ్రీనివాస్, చలమల్ల బాలకృష్ణ, నాయకులు వల్లదాసు రవికుమార్, బొబ్బాల యాకుబ్‌రెడ్డి, బైరు వెంకన్న, బనిషెట్టి వెంకటేష్, సుందర్ వెంకన్న, రామడుగు ధర్మాచారి, ఎండీ.ఆసీమ్‌అలీ, సారయ్య పాల్గొన్నారు.

గూడూరు: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టు, ఏపీలో సాక్షి కార్యాలయాలపై దుండగుల దాడిని ఖండిస్తూ మంగళవారం మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాకాంబ్రం, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, కర్ణాకర్, మహేందర్‌రెడ్డి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

కురవి: ఏపీలో సాక్షి కార్యాలయాలపై దాడులను, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని ప్రతీ ఒక్కరు ఖండించాలని టీయుడబ్ల్యూజే(ఐజేయూ) దాడుల నియంత్రణ జిల్లా కమిటీ కో–కన్వీనర్ బేతమల్ల సహదేవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గుంటి సురేష్, ఉపాధ్యక్షుడు గండమల్ల రోశయ్య, నాయకులు చల్ల వేణు, కమటం నాగేశ్వర్‌రావు, కొల్లూరి గణేష్, బానోత్ దేవేందర్‌నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కురవి: నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

బయ్యారం: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని టీయుడబ్ల్యూజే–143 జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య అన్నారు. మంగళవారం బయ్యారంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు అమర్నాద్, జనార్దన్, రవి, ఉపేందర్, థామస్, సుధాకర్, బండారి వీరన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

దంతాలపల్లి: మండలం వేములపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్ మంగళవారం తెలిపాడు. ఆధార్‌తో గుర్తింపు ఇచ్చినట్లుగానే, ప్రతి రైతుకు 11విశిష్ట సంఖ్య నంబర్లతో కేంద్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మండల ఉపాధ్యక్షుడిగా వీరరాజు

డోర్నకల్: మాలమహానాడు మండల ఉపాధ్యక్షుడిగా డోర్నకల్‌కు చెందిన పగిడిపల్లి వీరరాజును నియమిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు పగిడిపల్లి నాగేశ్వర్‌రావు ప్రకటించారు.

బాలిక అదృశ్యం

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైన ఘటనలో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సదరు బాలిక కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవటంతో ఆమె ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించండి

మరిపెడ రూరల్: పౌష్టికాహారం అందించడంతోపాటు పిల్లల ఆలనపాలన చూసుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను చేర్పించాలని ఎల్లంపేట అంగన్‌వాడీ–3 టీచర్ విజయకుమారి అన్నారు. మండలంలోని ఎల్లంపేట, బుర్హాన్‌పురం గ్రామాల్లో మంగవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నెల్లికుదురు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వరిపెల్లి వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని మునిగలవీడు గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రఫీ, లక్ష్మణ్, మండల కార్యదర్శి బైస స్వామి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫెన్సింగ్ రాళ్లు ధ్వంసం

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో జలగం వెంకన్న అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమికి ఏర్పాటు చేసుకున్న ఫెన్సింగ్ హద్దు రాళ్లను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం వ్యవసాయ భూమి వద్దకు రైతు వెంకన్న వెళ్లి చూడగా ఫెన్సింగ్ హద్దు రాళ్లు ధ్వంసం చేసి కింద పడేయడాన్ని గమనించాడు. వెంటనే సంఘటనపై సీరోలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దంతాలపల్లి: మండలానికి చెందిన ఓ అధికారి కారు, ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా, ఒకరికి గాయాలైన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. తొర్రూరు మండలం చీకటయపాలెం గ్రామానికి చెందిన సాదు మహేష్ తన ద్విచక్రవాహనంపై దంతాలపల్లి నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ శాఖ జిల్లా అధికారి కారులో మండలం కేంద్రంలోని ఓ కార్యాలయానికి వెళ్తున్న క్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈక్రమంలో వాహనదారుడికి గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ముస్లిం మతపెద్ద, జలదాత అవార్డు గ్రహీత మౌలానా అబ్దుల్ లతీఫ్ రషీది అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతిచెందారు. ఉమామురళీనాయక్, సింగు రమేష్, ఖలీల్, తదితరులు నివాళులర్పించారు.

ఇల్లు అడిగితే దుర్భాషలాడారు..

తొర్రూరు రూరల్: నిరుపేదలమైన మాకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అడిగినందుకు అధికార పార్టీ నాయకులు దుర్భాషలాడారని కంతాయపాలెం గ్రామవాసి గుగ్గిళ్ల శ్రీదేవి ఆరోపించారు. మంగళవారం మండలంలోని కంతాయపాలెంలో బాధితురాలు ఆమె గోడు వెల్లబోసుకున్నారు. చెప్పకోలేని రీతిలో అధికార పార్టీ నాయకులు తిట్టారని బాధిత మహిళ కన్నీటిపర్యంతమయ్యారు.

‘ఇందిరమ్మ ఆత్మీయ భరోసా’ను కల్పించాలి

గూడూరు: వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను వెంటనే కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ముంజంపల్లి వీరన్న డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. నాయకులు ఈక భిక్షం, కొమురయ్య, కట్టయ్య, జానకీ, తదితరులు పాల్గొన్నారు.


వసతి గృహాల తనిఖీ

డోర్నకల్: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంగళవారం మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, వార్డెన్ జ్యోతికుమార్ పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్‌ను మంగళవారం మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్ తనిఖీ చేశారు. పరిసరాలను, వసతులను పరిశీలించారు. పిల్లలకు ఇబ్బంది లేకుండా చర్య తీసుకోవాలన్నారు.

దంతాలపల్లి: విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతి గృహాలను అప్రమత్తం చేయాలని తహసీల్దారు సునీల్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, పెద్దముప్పారం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహంను మంగళవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వీరన్న, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ అప్సర్‌పాషా పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు.. బాధితుల ఆందోళన



పెట్రోల్‌లో కలిసిన నీళ్లను చూపుతున్న బాధితులు

కేసముద్రం: ఓ బంక్ పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయంటూ ఆరోపిస్తూ, పలువురు వాహనదారులు ఆందోళనకు దిగిన సంఘటన మున్సిపాలిటీలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌కి చెందిన తోట సాంబయ్య అనే వ్యక్తి మున్సిపాలిటీలో పరిధిలోని జ్యోతిరావుపూలే సెంటర్ సమీపంలో గల రామకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్(బంక్)లో ఉదయం రూ.200ల పెట్రోల్ బైక్‌లో కొట్టించుకున్నాడు. సాయంత్రం బైక్ స్టార్ట్ కాకపోవడంతో పెట్రోల్‌ను బాటిల్‌లో పట్టి చూడగా, అందులో నీళ్లు కనిపించాయి. దీంతో ఆగ్రహించిన అతడితోపాటు, పలువురు దడవాయిలు బంక్ వద్దకు చేరుకుని, ఆందోళనకు దిగారు. కాగా వర్షం కారణంగా పెట్రోల్ స్టోరేజీ ట్యాంక్‌లోకి నీళ్లు వెళ్లి ఉండవచ్చని బంక్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆందోళనకారులు అన్నారు.